ISSN 0971-278X

ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 482 ఆగస్టు 2025 వెల : రూ.20/-

ఆగస్టు 9 - ప్రపంచ ఆదివాసీ దినం



కొండపోడు కొడితేనే అడవి బోడి అవుతుందని
బిల్లు మీద బిల్లు పెట్టి అడివంతా నరికేస్తూ
భూతల్లిని వదలమంటె తెల్లోడిని తరిమినట్టు
తరిమి తరిమి తరిమి తరిమి కొడతాం!!

జనసాహితి ప్రచురణ

Scanned with OKEN Scanner

గౌడుల శ్రమ సౌందర్యాన్ని నినాద శబ్దంగా మలిచిన కవిత్వం
"ముస్తాదు"

మ్యాడం అభిలాష్

తెలంగాణ గ్రామీణ భాష యాసను, జీవన విశేషాలను అచ్చమైన తెలంగాణ నుడికారంతో కథలు రాసిన రచయిత శీలం భద్రయ్య. ఆయన రాసిన "లొట్టపీసుపూలు", "గ్గంగెద్దు" కథాసంపుటాలలో నల్లగొండ జిల్లా ప్రజల భాష, యాస, కులవృత్తులు, తెలంగాణ సాయుధ పోరాటం, ప్రజా తిరుగుబాటు, అణిచివేత, సామాజిక చిన్నచూపు, గ్రామీణ ప్రజల సాంస్కృతిక జీవనాన్ని పొందుపరిచాడు. తెలుగు సాహిత్యంలో ఈ కథలు ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి.

శీలం భద్రయ్య రాసిన "ముస్తాదు" కవిత్వం తెలుగులో తొలిగౌడ కవితా సంపుటి. ఇందులో గౌడజాతి ఘన చారిత్రక వైభవం, శ్రమ సౌందర్య తత్వం, గౌడుల ఆత్మగౌరవాలను బలంగా విన్పించాడు. కవిత్వంలో నిజాయితీతో కూడిన జీవితం ఉంటే కవిత్వం నినాదంగా మారుతుంది. ఆ కవిత్వం పదికాలాల బాటు ప్రజల నాలుకలపై నినాదాలుగా పదిలంగా ఉంటుంది. శీలం భద్రయ్య "ముస్తాదు" కవిత్వాన్ని గౌడజాతి నినాద శబ్దంగా మలిచాడు. ఈ కవిత్వం మినీ కవితల రూపంలో వచ్చినా, వాటిలోని భావపరిపక్వత విస్తృతమైన గౌడ జీవితానుభవాన్ని, సబ్బండ వర్గాల అనుబంధాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది గ్రామీణ వృత్తుల జీవన సౌందర్యాన్ని కవితా దీప్తిగా వెలిగించే ప్రయత్నం చేస్తుంది. ఇది కేవలం గౌడుల వ్యక్తిగత అనుభవాల్ని మాత్రమే కాకుండా, వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తికి సాహిత్యరూపం ఇచ్చే రచనా శైలి ఈ కవిత్వంలో కనబడుతుంది. తెలుగు సాహిత్యంలో పెద్దగా కనిపించని సామాన్యుడి జీవితానుభవాలు, కష్టాలు, వృత్తి పరికరాలు, వృత్తి విశేషాలు ఈ 'ముస్తాదు' కవితలలో పోతపోయబడ్డాయి. 'ముస్తాదు' గౌడుల వృత్తిసంకేతపదమే కాదు, అణచివేతకు గురైన వర్గాల గొంతుక. గౌడుల భాష, యాస అక్షరరూపంలో కవిత్వ సారంగా "ముస్తాదు"లో ప్రతిబింబిస్తుంది. తాటిచెట్టులా నిటారుగా నిలబడ్డ గౌడు జీవితాన్ని, వృత్తి జీవనాన్ని, కావడి కట్టి సమాజ కష్టసుఖాలను ఒక్కడిగా భుజాలపై మోసిన గౌడుల శ్రమజీవన సౌందర్యాన్ని శీలం భద్రయ్య "ముస్తాదు" కవితల్లో ఒదిగించగలిగాడు. ఈ సంపుటిలోని ప్రతీ కవితా ఖండిక – గౌడుల దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలు.



"ధూప దీపాలు తీర్చలేని
దుమారమంతా
తీర్చింది తాటి కల్లు"

ఈ కవితలో సమస్య, పరిష్కారం రెండూ ఉన్నాయి. సమాజంలో ఎక్కడికక్కడ చెలరేగే జీవన దుమారం ఒక్కోసారి ఆధ్యాత్మిక పరిధిని మించిపోతుంది. 'దుమారం' వాస్తవిక జీవిత సంక్షోభానికి రూపం. 'ధూప దీపాలు' దైవిక ఆరాధన, ఆచారానికి రూపం. వ్యక్తుల శారీరక, మానసిక ఒత్తిడులను మర్చిపోవడానికి దైవిక ఆరాధన, ఆచారానికి మించిన ఉపశమనంగా ప్రకృతిద్రవ్యం"కల్లు" మారిన చారిత్రక వాస్తవాన్ని ఈ కవితా వాక్యాలు తెలియజేస్తాయి. "ధూప దీపాలు తీర్చలేని దుమారమంతా" అనే కవితా వాక్యంలో ఆధ్యాత్మికతకు అన్ని సమస్యలను పరిష్కరించే శక్తి ఉండే అవకాశంలేదని, ఆ దుమారాన్ని "తీర్చింది తాటి కల్లు" అనే ముగింపు పాదంతో వాస్తవిక గ్రామీణ చారిత్రక జీవన చైతన్యం కనబడుతుంది. గ్రామీణ పండుగలలో కల్లును దేవతలకు ఆరబోయడమనే సంప్రదాయం గమనించవచ్చు. కల్లు కేవలం మత్తుపదార్థం కాదు. ఆరోగ్యాన్ని ఔషధగుణాలను కలిగి ఉండే సహజ చెట్టుద్రవం. అందుకే గౌడ కులస్తులు ఆయుర్వేద వైద్యులుగా కూడా ఉంటారు. సమాజం శాంతియుత జీవనానికి గౌడుల శ్రమను అంకితం చేసిన తీరును ఈ కవితలో పేర్కొన్నాడు.

"మంగళ వాయిద్యాలతో
కట్టిన మామిడాకు
పైకప్పునున్న తాటాకును చూసి ఈర్ష్య పడ్డది"

గౌడుల పట్ల సామాజిక సంప్రదాయ వివక్షను ఈ కవితలో

Scanned with OKEN Scanner

చెప్పాడు. ఇటీవల కులం కారణంగా గౌడులను దేవాలయాల్లోకి నిషిద్ధమనే వార్తను చదివాం. పండుగలు, వివాహాలు, ప్రత్యేక వేడుకల సమయాలలో అలంకరణలుగా, ఆచారాలుగా, శుభ ప్రదంగా భావించే మామిడాకుల తోరణాలు, తాటాకులను ప్రస్తావించిన ఈ మూడు పంక్తుల కవిత మనల్ని వినూత్న కోణంలో ఆలోచింపజేస్తుంది. మామిడాకు తోరణం శుభ సూచికగా పండుగ శోభను ఆనందాన్ని వైభవాన్ని తెలియజేస్తుంది. ఈ కవితలో పైకప్పుగానున్న తాటాకును చూసి మామిడాకు ఈర్ష్యపడింది. ఇది వింతగా అనిపించినా, కవిత్వంలోని లోతైన భావుకత, సామాజిక జీవన వాస్తవికత, లోకతీరుకు ఇది నిదర్శనం. సంబరాలు, వేడుకలు, శుభ సందర్భాలు, పండుగలకు మామిడాకును మాత్రమే ఆహ్వానిస్తారు. సమాజం మామిడాకుకు ఇచ్చే గౌరవం తాటాకుకు ఇవ్వదని, దైవిక సంబంధ వృత్తులకిచ్చిన గౌరవం గౌడ వృత్తికి ఇవ్వలేదనే కవి ఆవేదన కనబడుంది., వాస్తవానికి మామిడాకులా తాటాకు అలంకారం మాత్రమే కాదు, ఎన్నో తరాలు తలదాచుకోవడానికి ఉపయోగపడ్డాయి. శ్రమజీవి సౌందర్యం ముందు సంస్కృతి వెలవెలబోయిందనే అర్థంలో తాటాకుని చూసి మామిడాకు ఈర్ష్యపడిందని అంటాడు. ప్రకృతి ముందు వికృతిలా శ్రమముందు అలంకారం మోకరిల్లడం ఈ కవితలో కనిపిస్తుంది. అంతే కాకుండా సామాజిక విరోధాన్ని, అవగాహన లోపాన్ని కూడా ఇది సూచించగలదు.

"చేప పిల్లలా ఎదురెక్కి
ఆకాశ గంగను
నేలకు దించాడు"

ఈ కవిత ద్వారా గౌడుల జీవన ప్రయాణం దృశ్యమానం జరుగుతుంది. నీరు లోతువైపుకు ప్రయాణిస్తుంది. ఆ నీటి ప్రవాహానికి ఎదురుగా నిలిచి, నడిచే చేపపిల్ల ప్రయాణం ఒక సాహసోపేత స్ఫూర్తిమంతమైన ప్రయాణం. చేప పిల్లలో ఉన్న జీవన తపన, పోరాట చైతన్య శక్తి గౌడులోనూ ఉందని ఈ కవిత పేర్కొంది. "ఆకాశ గంగను నేలకు దించాడు" అనే వాక్యంద్వారా గౌడుల శ్రమఫలాన్ని ఆకాశం నుంచి భూమి మీదకు తెచ్చిన కర్మయోగి గౌడు అని అర్థమవుతుంది. "ఆకాశ గంగ" అనేది తాటికల్లు. . ఇది దేవతల పానీయం. దీనికి పవిత్రతను ఆపాదించాడు. దానిని భూమిమీదకు తెచ్చినవాడు గౌడు. అతడు శ్రమ ఫలితాన్ని, పరమ పవిత్రతను నేలకు దించాడు. ఆధ్యాత్మిక పవిత్రత, శ్రమ, భూమి-ఆకాశ సంబంధాన్ని తేటతెల్లంగా చూపే దృష్టి కవితలో ఉంది.

శీలం భద్రయ్య కేవలం కవి కాదు, జీవితాన్ని తాటి చెట్టంత ఎత్తునుంచి చూస్తున్న సామాజిక పరిశీలకుడు.

"శబరీ!
వనంలో కల్లు దొరకలేదా!?
రేగుపళ్ళు పెట్టావు!"

ఆదికవి వాల్మీకి రాసిన రామాయణ కావ్యంలో రాముడి కోసం ఎంగిలి రేగుపళ్లను సమర్పించిన భక్తురాలు శబరి కథ మనకు తెలిసినదే. ఈ కవితలో కవిలోని ఊహాశక్తి, సామాజిక-ఆధ్యాత్మిక, వాస్తవిక - ఊహాప్రపంచానికి మధ్య ఉన్న తార్కిక వ్యత్యాస దృష్టిని తెలియజేసింది. రామాయణ కాలంలో కల్లు ప్రస్తావన ఉంది. "వనంలో కల్లు దొరకలేదా?" అనే కొత్త ప్రశ్నను కవి ఎందుకు సంధించాడు? నిజంగా కల్లు దొరకలేదా? రాముడి పట్ల శబరికున్న భక్తిని శంకించే విధంగా కాకుండా, రాముడికి సరైన మర్యాద లభించలేదనే బాధ ఇందులో కనబడుతుంది. ఇది సామాజిక ప్రశ్న. సంప్రదాయాల పునర్వాఖ్యానం. కల్లుకు ప్రాధాన్యతను తగ్గించిన పవిత్రతపై సంధించిన ప్రశ్నగా మనం అర్థం చేసుకోవాలి. విభిన్న ప్రపంచాల మధ్య ఉండే పరిమితి, వైరుధ్యం కూడా చర్చించాల్సి ఉంది.

"ముస్తాదు" కవిత్వంలో మూడు, నాలుగు పాదాల కవితలే ఎక్కువగా ఉంటాయి. పొడవైన పాదాలు, అభివ్యక్తి లేదు. సరళత, స్పష్టత, లోతైన భావుకత, సాంద్రమైన ఆవేదన ఈ కవితల సొంతం. మూడు అడుగుల నేలతో ముల్లోకాలనూ ఆక్రమించుకున్న విధానాన్ని గురించి సాహిత్యం రాసుకున్నారు. అలాగే తన కవిత్వం కూడా మూడు నాలుగు పంక్తులలోనే చెప్పానని చెప్పుకున్న శీలం భద్రయ్య "ముస్తాదు" కవిత్వం ద్వారా లక్ష్యాన్ని చేరుకున్నాడు. గౌడజనుల ఆత్మాభిమానం, వారి సంస్కృతి, శ్రమ సౌందర్యం, వారి ఆత్మగౌరవాన్ని ఈ కవిత్వం ప్రోదిచేయ గలుగుతుంది.

"ముస్తాదు" కవితా సంపుటి కేవలం ఒక కులస్తుని జీవన దినచర్యను ప్రతిబింబించేది కాదు. సమాజంలోని శ్రమైక జీవుల ఊపిరి. "ముస్తాదు" వృత్తి నైపుణ్యాన్ని సాహిత్య మాటల్లోకి తెచ్చిన వినూత్న శైలి. అదేవిధంగా ఈ కవిత్వం చదవడమంటే కేవలం పేజీలను తిప్పడం కాదు. ఒక్కొక్క కవితా పంక్తి సాముహికగొంతుల వేదన. నిశ్శబ్దాన్ని గౌడ గీతంగా, గౌడకార్మికుని స్వేదాన్ని స్వరంగా వినిపిస్తుంది. కవిత్వానికి సామాజిక బాధ్యత ఉందని నమ్మే ప్రతీ పాఠకుడికీ "ముస్తాదు" కవిత్వం నమ్మకం కలిగిస్తుంది. కవిత్వంలో తాటిచెట్టుముద్రను, తాటిచెట్టుపై గౌడుల ముద్రను సాహితీప్రపంచంలో కవితా ముద్రగా వచ్చిన "ముస్తాదు" కవిత్వం ప్రజాకవిత్వంగా నిలుస్తుంది.

ముస్తాదు (కవిత్వం)
శీలం భద్రయ్య
మొదటి ముద్రణ : ఏప్రిల్ 2025
పేజీలు : 112 వెల : **రూ. 120/-**
ప్రచురణ : కర్షక్ ముద్రణాలయం, హైదరాబాద్
ప్రతులకు : **అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు**

Scanned with OKEN Scanner